



ఎస్వీయూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా చంద్రయ్య బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - క్యాంపస్



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన ఇన్చార్జి రిజిస్ట్రార్‌గా బి. చంద్రయ్య గురువారం కుల సచివుల చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. యూనివర్సిటీలోని యూజీసీ విభాగంలో జాయింట్ రిజిస్ట్రార్ గా ఎంతో కాలంగా పరిపాలన అనుభవం కలిగిన బి.చంద్రయ్య కు వర్సిటీ ఇంచార్జ్ రిజిస్ట్రార్ గా నియమించడం పట్ల వర్సిటీలోని విద్యార్థులు, పరిశోధకులు, బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది, అన్ని విభాగాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి వద్దకే ఎన్టీఆర్ భరోసా పింఛన్ : కలెక్టర్

1, 2 తేదీల్లో పంపిణీకి ఆదేశాలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

సామాజిక భద్రత పింఛన్లు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంగా పేరు మార్పు చేయబడిందని, పెంపుదల చేసిన సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ జూలై 1 న పంపిణీ చేసే అంశం విధి విధానాలపై రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, రాష్ట్ర గహ నిర్మాణ, గ్రామ, వార్డు సచివాలయాల స్పెషల్ సిఎస్ అజయ్ జైన్, పంచాయతీరాజ్ గ్రామీణ అభివద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్, ఆర్థిక శాఖ కార్యదర్శులు సౌరబ్ గౌర్, సత్యనారాయణ, గ్రామ వార్డు సచివాలయాల శాఖ సంచాలకులు శివప్రసాద్ తదితరులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తిరుపతి జిల్లా నుండి కలెక్టర్ ధ్యాన చంద్ర హెచ్ఎం సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను జులై ఒకటో తేదీన ఉదయం 6 గంటల నుండి పెన్షనర్ల ఇంటి వద్దే గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ఆధార్ బయో మెట్రిక్ లేదా ముఖ ఆధారిత లేదా ఐరిస్ లేదా రియల్ టైమ్ బెనిఫిసరి ఐడెంటిఫికేషన్ సిస్టమ్ అతెంటికేషన్ బేస్డ్ గా పంపిణీ చేయాలని ఆదేశించారు. అదే రోజు పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలన్నారు. ఏమైనా మిగిలిపోయినచో మరుసటి రోజున తప్పక పూర్తి చేయాలనీ సూచించారు. ఈ సందర్భంగా పింఛనుదారులు జూలై మొదటి రెండవ తారీఖులలో తప్పక అందుబాటులో వారి ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని కోరారు. గతంలో వాడుతున్న పెన్షన్ పుస్తకాలు వాడరాదని, ఈ జూలై నెలలో సామాజిక పెన్షన్ల పంపిణీ స్లిప్పులు, అక్నాలెడ్జ్మెంట్ స్లిప్పులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత సచివాలయం పరిధిలోని పంచాయితీ సెక్రెటరీ, వార్డు అడ్మిన్ సెక్రెటరీ శనివారం పెన్షన్ మొత్తాన్ని డ్రా చేసి భద్ర పరచి జూలై ఒకటో తేదీ నుండి లబ్ధిదారులకు పంపిణీ సచివాలయం సిబ్బంది ద్వారా చేయాలనీ సూచించారు. పింఛన్ల పంపిణీ కొరకు ఒక్కొక్క ఉద్యోగికి 50 గహాలు చొప్పున మ్యాపింగ్ పూర్తి చేసి కేటాయించాల్సి ఉంటుందని, అదనంగా ఉద్యోగులు అవసరం అయితే ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే వినియోగించాలని ఆదేశించారు.



కుప్పంలో అమ్మకానికి సిద్ధంగా ఫోటోఫ్రేమ్‌లు

బాబు, పవన్ ఫొటోలు బంపర్‌సేల్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఎన్డీఎ కూటమి అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రిగా కొణిదెల పవన్‌కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ వీరిద్దరి ఫొటోలు ఉండాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే కుప్పంలో మాత్రం ప్రతి ఇంటా వీరిద్దరి ఫొటోలను పెట్టుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. కుప్పంలో పంచాయతీ కార్యాలయం నుంచి మున్సిపాలిటీ వరకూ వీరిద్దరి ఫొటోలు దర్శనమిస్తున్నాయి. చంద్రబాబునాయుడు ఎనిమిదిసార్లు ముఖ్యమంత్రిగా గెలిచి, నాలుగుసార్లు ముఖ్యమంత్రి కావడంతో ఆయన ఇమేజ్ ఒకింత పెరిగిందనే చెప్పారు. ఈ నేపథ్యంలో కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల కార్యకర్తలు, అభిమానులు వీరిద్దరి ఫొటోలను ఇళ్లలో పెట్టుకునేందుకు సిద్ధమయ్యారు. కుప్పంలో ఫొటోఫ్రేమ్ అంగళ్లు ఏడు ఉండగా, అన్నింట్లోనూ వీరిద్దరి ఫొటోలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. నారా చంద్రబాబునాయుడు, కొణిదెల పవన్‌కల్యాణ్, నారా లోకేష్ ఫొటోలకు భారీ గిరాకీ పెరిగింది. కుప్పంలోని గిరి ఫొటోఫ్రేమ్ షాపులో యజమాని భూపతిని 'ప్రజాశక్తి' పలకరించగా గత పదహైదు ఏళ్లుగా ఇదే కుప్పంలో దేవుళ్ల ఫొటోలు అమ్ముకుని బతుకుతున్నారని, ఈ సారి జూన్ 5 నుంచి చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేష్, నరేంద్రమోడీ ఫొటోలను విక్రయానికి పెట్టానన్నారు. ఒక్కో ఫొటో సైజ్‌ను బట్టి 100 నుంచి రూ.1500 ధర పలుకుతోందని చెప్పారు. ఎక్కువగా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫొటోలు అమ్ముడుపోయాయి. మిగిలిన ఆరు షాపుల్లోనూ వ్యాపారం బాగుంది.



'ప్రశ్న'ను బతికించుకుందాం

బుద్ధుని ప్రవచనం పుస్తకావిష్కరణ బొజ్జాతారకం జయంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ప్రశ్నను బతికించుకోవడం అంటే బుద్ధుడు లాంటి సంస్కర్తల భావజాలాన్ని బతికించు కోవడమేనని పలువురు వక్తలు అన్నారు. 2600 సంవత్సరాల కిందటే దేశంలో జరుగుతున్న హింసను వ్యతిరేకిస్తూ అన్యాయాలను, అక్రమాలను బట్టబయలు చేస్తూ ప్రశ్నించడం నేర్పిన గౌతమ బుద్ధుడు లాంటి వ్యక్తులు నేడు మనకు అవసరమన్నారు...వేమన విజ్ఞాన కేంద్రం యశోదానగర్‌లో జరిగిన 'బుద్ధుని ప్రవచనం' పుస్తకావిష్కరణ సభలో పలువురు ప్రసంగించారు. బొజ్జా తారకం రచించిన బుద్ధుని ప్రవచనం అనే పదకొండవ ముద్రణను ఈ సందర్భంగా ప్రముఖులు ఆవిష్కరించారు. సభకు రిపబ్లికన్ పార్టీ అధినేత పూతలపట్టు అంజయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా విశ్రాంత న్యాయమూర్తి గుర్రప్ప, ప్రముఖ సీనియర్ జర్నలిస్టు రాఘవ, సిఐటియు నేత కందారపు మురళి, మల్లేశ్వరరావు, కవి రచయిత గొడుగు చింత గోవిందస్వామి, వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా వక్తలు బొజ్జా తారకం సేవలను కొనియాడారు. ఆయన రచించిన బుద్ధుని ప్రవచనం పుస్తకం దాని ప్రాధాన్యతను ఈ సందర్భంగా వక్తలు ప్రస్తావించారు. కులాల పేరిట, మతాల పేరిట ఒకరినొకరు నిందించుకునే తీవ్రమైన పరిస్థితులు దేశంలో ఏర్పడ్డాయని గుర్తు చేశారు. దేవుడనే వాదనకు వ్యతిరేకంగా నిలబడిన బుద్ధుడు ఆఖరికి దశావతారంలో ఒకరుగా మారిపోయిన వైనాన్ని వివరించారు. రానున్న కాలంలో మేధావులు ప్రశ్నించడం మరింత పెరగాలని అందుకొరకు వేమన విజ్ఞాన కేంద్రం, దళిత వికాస వేదికలు సంయుక్తంగా కషి చేస్తాయని ఈ సందర్భంగా వక్తలు ఉద్ఘాటించారు.

హోటళ్లలో శుచి, శుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లలో సంబంధిత యాజమాన్యాలు శుచిశుభ్రత పాటిస్తూ ఆహార నాణ్యతా నియమాలు పాటించాలని, ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార భద్రత అధికారి మద్దిలేటి అన్నారు. కెవిబిపురం మండలం కాట్రపల్లిలో డయేరియా ప్రబలిన ఘటన నేపథ్యంలో జిల్లా ఆహార భద్రత అధికారి మద్దిలేటి, మండల అధికారి జగదీష్, సివిల్ సర్జన్ బ్యాక్టీరియాలజిస్ట్ డాక్టర్ రమేష్ సంయుక్తంగా విచారణ చేపట్టి గ్రామంలో అనుమానిత నీటి నమూనాలను సేకరించి ల్యాబొరేటరీకి పంపారు. మాంసాహారాన్ని బాగా వేడిచేసిన తరువాత తీసుకోవాలని సూచించారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. లైసెన్స్ పొందని హోటళ్లకు నోటీసులు పంపిస్తామన్నారు.

మాతా శిశు మరణాలను అరికట్టాలి

ప్రజాశక్తి వెంకటగిరి రూరల్

తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలోని చింతగుంట గ్రామపంచాయతీలో జిల్లా వైద్య టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య టాస్కోఫ్ర్స్ అధికారి మాట్లాడుతూ మాతా శిశు మరణాలను అరికట్టడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంత మహిళల కు, బాలికలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గర్భవతులు బాలింతలు రక్తహీనతతో మరణించకుండా ముందు జాగ్రత్తగా తమ సిబ్బందిని చర్యలు తీసుకునే విధంగా ఆదేశిస్తున్నట్లు అన్నారు. మహిళలు బాలింతలు పౌష్టికాహారాలను తీసుకోవాలని ప్రతినెలా క్రమం తప్పకుండా ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించుకుని సంబంధిత మందులను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సి.నాగేంద్ర కుమార్, స్టాటిస్టికల్ ఆఫీసర్, ఏ బేబీ రాణి, డిపిహెచ్ఎన్‌వో ఇంచార్జ్, పి ప్రకాష్ డిపిఓ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కే శివకష్ణ రెడ్డి, ఎస్ ఓ నాగేంద్ర, సూపర్వైజర్ సుశీల పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు అనివార్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, గూడూరు టౌన్

భారతదేశ బలమైన ఆర్థిక శక్తిగా పురోగతి సాధించాలంటే ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు అవలంబించాల్సిన అవసరం ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుబ్రమణ్యం, నాయకులు సాయిలక్ష్మి, మాధవయ్య అన్నారు. శ్రీకాళహస్తి, గూడూరుల్లో శాఖా కార్యదర్శుల రాజకీయ శిక్షణా తరగతులు కొనసాగాయి. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాల కారనంగా భారతదేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతోందన్నారు. ప్రజా ఉద్యమాలే ఊపిరిగా ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం కృషి చేస్తుందన్నారు.





ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

సూళ్లూరుపేట భవిత ఎమ్మార్ స్కూల్ నందు దివ్యంగుల దేవత హెలెన్ కెల్లర్ 144 వ జయంతిని ఎన్‌పిఆర్‌డి సంఘం దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక గురువారం ఘనంగా నిర్వహించింది. ఆమె చిత్ర పటానికి పూల మాలను టిడిపి నాయకుడు ఆకుతోట రమేష్ వేసి నివాళి అర్పించారు. ఆమె స్టేజి యాక్టర్, రైటర్ వాటిపై వచ్చిన ఆదాయాన్ని ఆమె సేవలను గుర్తించి ప్రెసిడెంట్ ఆఫ్ అమెరికా సన్మానించి ఇచ్చిన ధనంను సైతం దివ్యంగుల క్షేమానికే వెచ్చించి జీవితాన్ని వారి సేవకే అంకితం చేశారని కొనియాడారు. ఈ సందర్భంలో భవిత స్కూల్ పిల్లలకు పుస్తకాలు పెన్‌లు, పెన్సిల్స్, బిస్కెట్స్, స్వీట్స్, ఫ్రూట్స్ పంచి పెట్టారు. సూళ్లూరుపేటలో ఎస్టి బాపూజీ కాలనీలోని దివ్యంగుని పై దాడి జరిగి ఆటో అద్దాలు విరిచి ఆతని జీవనాధారం పోగొట్టినందుకు అతనికి ఒక నెలకు సరిపడా బియ్యం, వంట దినుసులు, ఖర్చులకు అమౌంట్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ పి ఆర్ డి అధ్యక్షులు ఎన్ శాంతి కుమారి, భవిత టీచర్ భార్గవి, దివ్యంగులు సూర్య, శివ, పోలయ్య, శివ కుమారి, కనకమ్మ, సుబ్బమ్మ, చెంగమ్మ పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



నగరంలోని ట్రాఫిక్ పాయింట్లను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తిరుపతిలోని గాంధీ రోడ్డు, చిన్న బజారు వీధి, తీర్థకట్ట వీధి, బండ్ల వీధి, కరణాల వీధి, బేరి వీధులలో ఖచ్చితంగా వన్ వే అమలు చేయాలన్నారు. పూల మార్కెట్ షాపులకు ఇరువైపుల ఉన్నటువంటి అడ్డంకులను తొలగించి పాదచారులకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. గోవిందరాజస్వామి ఉత్తర మాడా వీధిలో వాహనాలు పార్కింగ్ అమలు, గోవిందరాజ స్వామి గుడి వెనకాల ఉన్నటువంటి స్టేట్ బ్యాంకు అధికారులకు బ్యాంకు ముందు వాహనములు పార్క్ చేయనీకుండా సెక్యూరిటీని ఉంచమని సూచించారు. రైల్వే స్టేషన్ ముందర పరిశీలించి ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా చూడమన్నారు. రైల్వే స్టేషను ముందర ఆటో స్టాండ్ వారితో మాట్లాడి చిన్న సమస్యలు పరిష్కరించాలని ట్రాఫిక్ డిఎస్పీకి ఆదేశించారు. ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రమణ కుమార్, రవి మనోహరాచారి పాల్గొన్నారు.

డయేరియా రోగులకు మెరుగైన వైద్యం అందివ్వండి : డిసిహెచ్ఎస్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

అతిసార(డయేరియా) వ్యాధి బారిన పడి శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీసీహెచ్ఎస్ మురళీకష్ణ వైద్యాధికారులను ఆదేశించారు. డీసీహెచ్ఎస్ మురళీకష్ణ గురువారం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. తూర్పు మండలాల్లో అతిసార వ్యాధి ప్రబలుతున్న నేపథ్యంలో ఏరియా ఆసుపత్రిలోని ఐడీహెచ్ వార్డును పరిశీలించి రోగులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యం, సౌకర్యాలపై ఆరా తీశారు. అవసరమైతే అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అతిసార అదుపులోకి వచ్చే వరకు వైద్య సిబ్బంది అన్ని వేళలా రోగులకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంవో డాక్టర్ మధు పాల్గొన్నారు.



ఆకతాయిలను అదుపు చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పట్టణంలో ఆకతాయిల ఆగడాలు అధికమవుతున్నాయనీ, ఫలితంగా విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారంటూ టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం. ఉమేష్ రావు తెలిపారు. వెంటనే పోలీసులు వారి ఆట కట్టించాలని కోరారు. పట్టణంలోని యన్టీఆర్ నగర్, తెలుగుగంగ కాలనీ, పూసల వీధి కూడలి, రిజర్వాయర్ రోడ్డు లోని పాల డిపో కూడలి, జయరాం రావు వీధిలోని వైష్ణవ కోనేరు, కొత్త కోనేరు యస్టీ కాలనీ, కొత్తపేట లోని బాలికల ఉన్నత పాఠశాల, ఆర్టీసీ బస్టాండు కూడలి మొదలైన ప్రాంతాలలో ఆకతాయిల చేష్టలు రోజు రోజుకూ మితి మీరిపోతున్న నేపథ్యంలో పోలీసు గస్తీ పెంచాలని కోరారు. నెమళ్ళూరు బుజ్జి, సయ్యద్ చాంద్ బాషా, షేక్ జిలానీ పాల్గొన్నారు.

టిటిడి ఈవోను కలిసిన యునైటెడ్ ఫ్రంట్ నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు చేపట్టిన జె.శ్యామలరావును టిటిడి యునైటెడ్ ఫ్రంట్ నాయకులు మర్యాదపూర్వకంగా గురువారం కలిసారు. టిటిడి ఉద్యోగులకు ఇచ్చిన ఇంటి స్థలాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, ఏర్పేడు వద్ద ఇంటి స్థలాల ప్రొసీడింగ్ ఇచ్చిన ఉద్యోగులకు త్వరగా స్థలాలు చూపాలని, పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు త్వరగా ఇవ్వాలని, టిటిడి ఉద్యోగులకు రెఫరల్‌పై మెరుగైన వైద్య సౌకర్యం అందించాలని కోరారు. టిటిడిలో ఓఎస్‌ఒలకు పనిభారం పెరిగిందన్నారు. కారుణ్య నియామకాలు భర్తీ చేయాలని కోరారు. ఈవోను కలిసిన వారిలో గోల్కొండ వెంకటేశం, కాటా గుణశేఖర్, వి.వెంకటరమణ, ఎన్.పద్మనాభం, మల్లారపు నాగార్జున, పూజారి రత్నప్రభాకర్ పాల్గొన్నారు.

టీటీడీ ఈవో ను కలిసిన బీసీ ఉద్యోగులు

టీటీడీ కార్యనిర్వహణ అధికారి శ్యామల రావును గురువారం పరిపాలన భవనంలో టీటీడీ బీసీ ఉద్యోగ సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు. టీటీడీలో బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఈవో దష్టికి తీసుకెళ్లారు. అందుకు ఈవో సానుకూలంగా స్పందించినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈవో ను కలిసిన వారిలో రాజకుమార్, రవీంద్రబాబు, కామరాజు, డాక్టర్ భరత్ కుమార్ ఉన్నారు.



రోడ్డు ప్రమాదంలో ప్రజాశక్తి విలేఖరి నిస్సార్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- రేణిగుంట



తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ

రేణిగుంట మండలంలోని గాజులమండ్యం సమీపంలో పుత్తూరు నుంచి రేణిగుంటలో ద్విచక్ర వాహనంలో వస్తున్న ప్రజాశక్తి విలేకరి నిస్సార్ అహ్మద్‌ను కేఎంఎస్‌టిఎన్ 21 ఏ యూ 38 30 నెంబరు కలిగిన ప్రైవేట్ బస్సు వెనుక వైపు నుంచి ఢీకొంది. డ్రైవర్ అజాగ్రత్త వల్ల బస్సు నడపడంతో ద్విచక్ర వాహనంలో ఉన్న ప్రజాశక్తి విలేకరి నిస్సార్ అహ్మద్‌ను ఢీకొనడంతో తీవంగా గాయపడిన అతనిని రుయా హాస్పిటల్ చికిత్స కోసం తరలించారు. గురువారం ఉదయము తమిళనాడు రాష్ట్రం తిరుత్తనిలో తన భార్య బిడ్డను చూసి తిరిగి రేణిగుంటకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఈ ఘటన జరిగింది. స్థానికులు గుర్తించే 108 లో రుయాకు తరలించారు. అతనికి నడుము వద్ద ఎముకలు విరిగాయి. రుయా వైద్యులు అన్ని పరీక్షలు చేసి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. గాజులమండ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబ్సిడితో వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రాపురం

రైతును రాజును చేయడమే ఎన్‌డిఎ కూటమి లక్ష్యమని చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తి నాని అన్నారు. గురువారం చంద్రగిరి, రామచంద్రాపురం మండలాల్లో రైతులకు రాయితీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను, వేరుశనగ విత్తనాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయాలన్నారు. రాయలచెరువును రెండేళ్లలో ప్రాజెక్టుగా మార్చడానికి నీటిపారుదల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తే, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి రెండేళ్లలో పూర్తి చేస్తానన్నారు. చెరకు రైతుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తిరుపతి - రాయలచెరువు రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా గతంలో సి.రామాపురం వరకూ మాత్రమే పనులు ప్రారంభించారని, ఆ రోడ్డును రాయలచెరువు వరకూ విస్తరించేలా త్వరలో ప్రారంభిస్తానన్నారు. చంద్రగిరి అభివృద్ధికి నిధులు తెచ్చి అధికారుల సమన్వయంతో అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.తిరుమలరెడ్డి, జనార్ధన్‌చౌదరి, కె.రామిరెడ్డి, ముద్దుకృష్ణారెడ్డి, పాలపర్తి బాబు యాదవ్, కె.ధనంజయరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



రైతులకు వేరుశనగ విత్తనాలు ఇస్తున్న పులివర్తి నాని

సాయి సుధాలో ఉచిత గ్లకోమా వైద్య శిబిరం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

స్థానిక తిలక్ రోడ్ లోని శ్రీ సాయి సుధా కంటి ఆసుపత్రిలో సుధారాణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత గ్లకోమా వైద్య శిబిరం జరిగింది. ఈ ఉచిత వైద్య శిబిరం నందు సుమారు 50 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు ఇచ్చారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ మధుమేహం ఉన్న వారిలో గ్లకోమా అనే నీటి కాసుల వ్యాధి వస్తుందని, ఇలాంటప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలు రెటీనాలోని రక్తనాళాలను దెబ్బతీస్తాయన్నారు. డయాబెటిస్ ఉన్నవారు ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా గ్లకోమా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నట్లయితే , గ్లకోమా బారిన పడకుండా , కంటి చూపు కోల్పోకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో హాస్పటల్ సిబ్బంది హిమ బిందు, చిట్టెమ్మ, మహేష్, సునీత పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం పల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు చరణ్‌తేజ్, హేమలు ఎన్ఎంఎంఎస్ పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటారు. నవంబర్ 2023న నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడంతో పాఠశాల హెచ్ఎం గురువారం వారిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రూ.12వేలు చొప్పున నాలుగేళ్ల పాటు నగదు అందిస్తుందని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు అన్ని పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరుస్తుండటం ఆనందాన్ని కలిగించిందన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి: సిపిఐ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: టీడీపీ మ్యానిఫెస్టో ద్వారా ప్రకటించిన సాగు సాయం రైతుకు రూ.20వేలు ఈ ఖరీఫ్ సీజన్‌లోనే అందించాలి, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియలు చేపట్టి రుణాలు అందించాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఉప తహశీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కత్తి రవి, సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం సరస్వతి కండ్రిగ మాజీ సర్పంచ్ అగరంబులం చిన్నకన్నయ్య అనారోగ్యంతో గురువారం ఉదయం స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మాజీ సర్పంచ్ మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపాన్ని తెలిపారు.

పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం చోడవరం కు చెందిన టిడిపి యువ నాయకుడు గురునాధంను గురువారం గాలి మురళినాయుడు గురువారం పరామర్శించారు. గత కొంతకాలంగా అనారోగ్యం బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో మురళీ నాయుడు గురునాధంను పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మాజీ వైస్ ఎంపీపీ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రతిపక్ష స్థాయిని కోరడం హాస్యాస్పదం'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అసెంబ్లీలో ప్రతిపక్ష స్థాయిని కోరడం హాస్యాస్పదమని, ప్రజాతీర్పును అవహేళన చేయడమేనని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, సీఎంగా పనిచేసిన జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీ మొత్తం సభ్యుల్లో పదో వంతు ఉంటేనే ప్రతి పక్ష హోదా వస్తుందన్న విషయం కూడా తెలియకపోవడం విచారకరమన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు విద్యార్థి ఎంపిక



ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి విశ్వం టాలెంట్ స్కూల్ నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థి ఆర్యన్ టీ.హేమన్స్ క్రితిక్ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. విజయవాడలోని శాతవాహన జూనియర్, డిగ్రీ కాలేజ్ నందు 24వ తేదీ వరకు జరిగిన 6వ ఓపెన్ అండర్-10 రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలో రికర్వ్ విభాగంలో తమ విద్యార్థి ఆర్యన్ టీ.హేమన్స్ క్రితిక్ ఉత్తమ ప్రతిభను కనబరచి జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా హేమన్స్ క్రితిక్, కోచ్ టి.ధనంజేయులును విశ్వం విద్యా సంస్థల అధినేతతో పాటు అకాడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి అభినందించి జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరచాలని ఆకాంక్షించారు.

ఏపి లా సెట్‌లో మెరిసిన ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-క్యాంపస్: ఏపి లాసెట్ ప్రవేశ పరీక్షలో టీటీడీ నిర్వహణలోని శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలకు చెందిన ఎల్.గంగాధర్ 86వ ర్యాంక్, వి.లారెన్స్ 313వ ర్యాంక్ సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ సి.ప్రకాష్ బాబు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఇచ్చిన ప్రోత్సాహంతో తాము ఉన్నత ర్యాంకులను సాధించగలిగామని, కళాశాలలో ఇంటిగ్రేటెడ్ సిలబస్‌తో పాటు పోటీ పరీక్షలకు ఇచ్చిన శిక్షణ తమకు ఎంతగానో ఉపకరించిందని, లా కోర్సు చేసి సామాన్య ప్రజలకు న్యాయపరమైన అంశాల్లో సేవ చేయాలనే ఆశయంతో కష్టించి ఉత్తమ ర్యాంక్‌లను సాధించామని వారు తెలిపారు.

ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షునికి సభ్యుల మద్దతు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షులు కే.రామ సూర్యనారాయణకి గురువారం ఏపీజీఈ సభ్యులు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయనపై ఉన్న అభియోగం లేని కేసులను ఉపసంహరించవలసిందిగా కోరుతూ పుత్తూరు తాలూకా ఏపీజీఈఎ సభ్యులందరూ ముక్తకంఠంతో మద్దతు తెలిపారు. కార్యక్రమంలో తాలూకా ఎన్జీవో ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రవికుమార్, నాయకులు గురుస్వామి, ముని కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



మద్ధతు తెలుపుతున్న ఏపీజీఈ సభ్యులు

పడకేసిన పారిశుద్ధ్యం

- చెత్త దండి.. వీధులంతా నిండి
- మంగళం పంచాయతీలో కంపు కంపు
- పట్టించుకోని పాలకులు.. చోద్యం చేస్తున్న అధికారులు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అది పచ్చని అటవీ ప్రాంతానికి సరిహద్దు పంచాయతీ.. రోజంతా కాయకష్టం చేసుకొనే కార్మిక జీవులే అక్కడంతా.. 6వేల మందికి పైగా జనభా నివాసముంటున్న మంగళం పంచాయతీలో ఆవాసాలన్నీ పక్కపక్కనే ఉంటాయి. జెడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు, రెండు ప్రాథమిక పాఠశాలలూ, జూనియర్ కళాశాల ఆ ప్రాంతంలోనే ఉంది. వేల మంది జనాభా ఉన్న చోట పారిశుద్ధ్యం నిత్యకృత్యం. అయితే పాలకుల నిర్లక్ష్యమో.. అధికారుల అలసత్వమో గానీ అడుగడునా అపరిశుభ్రం పాలకుల నిర్లక్ష్యపు దోరణిని వేలెత్తి చూపుతోంది. పేరుకు పోయిన చెత్త, నిండిన కుళ్ల వ్యర్థాలు, తొలగించని చెత్తకుండిలతో ఎక్కడ చూసినా దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమలు ప్రబలి, వ్యాధులు అంటుకుంటున్నాయి. ఆ వీధుల్లో వృద్ధులు, చిన్నపిల్లలు జ్వరాల బారిన పడి ఆసుపత్రిపాలవుతున్నారు. ఇంతా జరుగుతున్నా అక్కడి సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటం వారి నిర్లక్ష్యపు దోరణకి అద్దం పడుతోంది. విషజ్వరాలు ప్రబలితే.. ఆవాసాలన్నీ పక్కపక్కనే ఉండటం వల్ల వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని అక్కడి స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై చెత్త చెదారాలు తొలగించి, పారిశుద్ధ్యం పనులు విస్తృతంగా చేపట్టాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు. అలానే మంగళం పంచాయతీ పరిధిలోని తిరుపతి-కరకంబాడీ ప్రధాన రోడ్డు మార్గంలో ఇసుక దట్టంగా పెరుకపోయింది. గతంలో వారంలో ఓ రోజు పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది రోడ్డును శుభ్రపరిచేవారు. ఇప్పుడు పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాహన చోదకులు, పాదచారులు పెదవివిరిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బందిని పురమాయించాలని వేడుకుంటున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గురుకుల పాఠశాల, ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గూడూరు గ్రేడ్ వన్ పరిధిలోని చెన్నూరు గ్రామంలో ఉన్న గురుకుల పాఠశాల ప్రభుత్వ పాఠశాలలను ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. కొద్ది రోజులుగా గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. జేసీ, విద్యాశాఖ అధికారులు స్థానిక టీడీపీ నాయకులు పాఠశాలకు వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. కలుషిత మంచినీటి సరఫరా కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురి అయినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఈ తరుణంలో ఎమ్మెల్యే పాఠశాలను తనిఖీ చేసి అక్కడ ఉన్న వసతులను స్థానిక అధికారులతో చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ విద్యా సంస్థలలో మెరుగైన వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశిస్తున్నామన్నారు. నాయకులు కరుణాకర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శ్రావణి, మురళి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పూజలు..

మండలంలోని చెన్నూరు గ్రామంలో గ్రామదేవత పోలేరమ్మ జాతరకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలను అందచేశారు.

పద్ధతులు మార్చుకోండి..

- అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే భాను



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: అధికారులు పద్ధతులు మార్చుకొని ప్రజలకు మేలు చేసేందుకు కృషి చేయాలని, నాటకాలాడితే వినటానికి రోజా కాదని తాను భానును అంటూ ఘాటుగా హెచ్చరించారు. గురువారం పుత్తూరు మున్సిపల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మారింది, అధికారుల తీరు కూడా మార్చుకోవాలని హెచ్చరించారు. పూర్తి స్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలని ప్రజల వద్దకు తీసుకు పోవాలని సూచించారు. అలా కాదని వ్యవహరిస్తే సస్పెన్షన్‌లు, క్రిమినల్ కేసులకు సిద్ధపడాల్సి ఉంటుందని హెచ్చరించారు. అభివృద్ధి, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం దృష్ట్యా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని హితవుపలికారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆనంగి గెడ్డం హరి, వైస్ చైర్మన్లు జయప్రకాష్, శంకర్, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, శానిటరీ ఇన్స్పెక్టర్ పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలలో విస్తృత పరిశోధనలు జరగాలి

- ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ తార సత్యవతి

ప్రజాశక్తి-క్యాంపస్: చిరుధాన్యాల పంటలలో దేశంలోనే విస్తృతస్థాయిలో ప్రత్యేక ఉత్పత్తి ఉత్పాదికను దిగుబడిని ఇచ్చే వంగడాలను రకాలను అభివృద్ధి చేసేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధకులు కృషి చేయాలని జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి, ప్రాజెక్ట్ కోర్డినేటర్ డాక్టర్ మధుసూదన మాట్లాడుతూ గత సంవత్సరం సజ్జ పంటలో, జొన్న, ఇతర చిరుధాన్య పంటలలో జరిగిన విస్తృత పరిశోధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో రెండు రోజుల కార్యాచరణ గురించి వారు మాట్లాడుతూ సజ్జ పంటకి 59వ వార్షిక సమావేశం, జొన్నకి 54వ, ఇతర చిరు ధాన్య పంటలకు 35వ వార్షిక సమావేశం అని తెలిపారు. చిరు ధాన్యాలను పండించు వివిధ రాష్ట్రాలలో జరిగిన పరిశోధన ప్రగతి గురించి చర్చించడం జరుగుతుందన్నారు. చిరుధాన్య పంటలలో దేశవ్యాప్తంగా విడుదలైన రకాలు, అభివృద్ధి పరిచిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై సమగ్ర చర్చ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల వ్యవసాయ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్వాధీనం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: విలువైన ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట అటవీ రేంజ్ అధికారి దత్తాత్రేయ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అందిన రహస్య సమాచారం మేరకు 27వ తేది గురువారం ఉదయం చామల వెస్ట్ బీట్ పరిధిలోని బొమ్మాజీ కొండ అటవీ ప్రాంతంలో అక్రమ రవాణా చేస్తున్న కూలీలను గుర్తించి దాడు నిర్వహించామన్నారు. తమిళనాడు విల్లుపురం జిల్లా సంగరాపురంకు చెందిన శక్తివేల్ రామస్వామని అరెస్టు చేసి తిరుపతి కోర్టుకి రిమాండ్ పంపడం జరిగిందన్నారు. అతని వద్ద నుండి 124 కేజీలు బరువు గల 6 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొన్నట్లు వివరించారు. ఈ దాడిలో ఎఫ్ఎస్‌వో ఎస్సార్ తౌఫిక్ ఇస్లాం, ఎఫ్‌బీవోలు కె.రెడ్డప్ప రెడ్డి, ఎమ్.సదాశివయ్య, కె.లోకనాథం పాల్గొన్నారు.

శ్రీసిటీలో భవిష్యనిధి, భీమా సేవలపై అవగాహనా సదస్సు



ప్రజాశక్తి-వరదయ్యపాలెం: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ), ఉద్యోగుల రాష్ట్ర భీమా పథకం (ఈఎస్ఐసి) సంయుక్త ఆధ్వర్యంలో 'నిధి ఆప్కే నికత్ 2.0' పేరిట శ్రీసిటీ వాణిజ్య కేంద్రంలో గురువారం ఉద్యోగుల భవిష్యనిధి, భీమా సేవలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈపీఎఫ్ఓ తిరుపతి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రేమలాల్, ఈఎస్ఐసి తిరుపతి బ్రాంచి మేనేజర్ సి.నాగమణి సదస్సులో పాల్గొని పై అంశాలపై సవివరంగా పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి వివిధ కంపెనీలకు చెందిన సుమారు 100మంది మానవ వనరుల ప్రతినిధులు (హెచ్‌ఆర్‌లు) హాజరయ్యారు. ఈ సందర్భంగా, అధికారులు ఈపీఎఫ్ఓ పరంగా ప్రభుత్వం చేపడుతున్న వివిధ చర్యల సమగ్ర సమాచారాన్ని అందించారు. ఈ-నామినేషన్, యుఏఎన్ యాక్టివేషన్, కెవైసి అప్‌డేటింగ్, బ్యాంక్ ఆధార్ సీడింగ్, ఆన్‌లైన్ ఈసీఆర్ ఫైలింగ్, ఎంప్లాయీస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పథకం, ఉద్యోగుల పెన్షన్ పథకాలకు సంబంధించి ఉద్యోగులు లేవనెత్తిన అనేక ప్రశ్నలకు సమాధానాల రూపంలో వారి సందేహాలను నివృత్తి చేశారు. పై పథకాల పలు ప్రయోజనాలను వివరించారు.

శుద్ధ జలాలను అందించాలి

- ట్యాంకులన్నీ పరిశుభ్రంగా ఉంచండి
- పుత్తూరు మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎం రెడ్డి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: తాగునీటి ట్యాంకులన్నీ శుభ్రపరచి శుద్ధ జలాలను సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని పుత్తూరు పురపాలక కమిషనర్ కేఎల్ఎం రెడ్డి తెలిపారు. పుత్తూరు బీసీ సంక్షేమ వసతి గృహంలో గురువారం సిబ్బందితో కలసి తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కావలసిన సౌకర్యాలు కల్పించాలని వసతి గృహం అధికారులకు సూచించారు. అతిసార, సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వ్యర్థాలను శుభ్రపరచాలని ఆదేశించారు. కమ్యూనిటీ పబ్లిక్ మరుగుదొడ్లు ప్రతిరోజు శుభ్రం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో మంచినీటి సురక్షిత తాగునీటిని అందించాలని పేర్కొన్నారు. చేతులు తరచుగా శుభ్రం చేసుకోవాలని అవగాహన కల్పించారు.



బడి ఈడు పిల్లలు బడిలో చేరండి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కాటూరు పంచాయతీలోని ఎంపీపీ పాఠశాల ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం ఆధ్వర్యంలో గురువారం 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని చేపట్టారు. బడి ఈడు పిల్లలందరినీ తప్పని సరిగా పాఠశాలలో చేర్పించాలని గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు.

ప్రజాశక్తి-పిచ్చాటూరు: మండలంలోని రాజానగరం ఎంపీపీ పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల పరిధిలో ఎంఈవో హేమమాలిని ఆధ్వర్యంలో 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని చేపట్టారు. హెచ్ఎం వాసుతో కలిసి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

విద్యా సామాగ్రి పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం మేర్లపాక ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు టెస్ట్ బుక్కులు, స్కూల్ బ్యాగులు, పెన్నులు, పెన్సిల్స్, చాక్లెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు నరసింహులు నాయుడు, రవిరెడ్డి, గోపాల్‌రెడ్డి, శివారెడ్డి, శంకరయ్య యాదవ్, వెంకట రమణయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

- పట్టు వస్త్రాలు సమర్పించిన సుధా రెడ్డి

ప్రజాశక్తి-రామచంద్రపురం(తిరుపతి రూరల్): తిరుపతి రూరల్ మండలం, కుప్రపాకంలో గంగమ్మ జాతర ఉత్సవాలను గ్రామ ప్రజలు గురువారం వేడుకగా నిర్వహించారు. గంగమ్మ జాతర సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి పట్టు వస్త్రాలతో ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి దర్శించుకున్నారు.

ఏ.రంగంపేటలో..

టీడీపీ అధికారంలోకి రావాలని ఎన్నికలకు ముందు కార్యకర్తలు మొక్కుకున్న మొక్కులు ఒక్కొక్కటిగా చెల్లించుకుంటున్నారు. గురువారం ఎ.రంగంపేటకు చెందిన టీడీపీ వీరాభిమాని బీసీ నాయకుడు తోకల రమేష్ పార్టీ అధికారంలోకి వచ్చి సీఎంగా చంద్రబాబు, పులివర్తి నాని ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయడంతో గ్రామంలోని నడివీధి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు.

అదిగో కాసిరాయి.. ముందు చూసి రావోయి..



కరకంబాడీ-మంగళం ప్రధాన రహదారిలో కాసిరాళ్ల రోడ్డు పక్కనే పడి ఉన్నాయి. ప్రమాదకరంగా ఉన్న ఈ రాళ్ల వద్ద వాహనాలు అదుపుతప్పితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇటీవలే ఓ ద్విచక్రవాహన చోదకుడు అత్యవసరంగా వాహనాన్ని అపే క్రమంలో కిందపడిపోయాడు. అదే విధంగా ఓ కారు అదుపు తప్పి కాసిరాళ్లను ఢీకొట్టింది. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా.. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోలేదు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో.. ఎలాంటి సంఘటనలు చూడాల్సి వస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- ప్రజాశక్తి-మంగళం

రైతులకు సకాలంలో వంగడాలను అందించాలి: నెలవల



ప్రజాశక్తి-దొరవారిసత్రం: అన్నదాతలకు అవసరమైన వరి వంగడాలను సకాలంలో సబ్సిడీ విధానంలో అందించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ వ్యవసాయ అధికారులకు ఆదేశించారు. గురువారం ఆమె పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను రైతులకు సబ్సిడీలో పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యవసాయంలో అధిక దిగుబడులు వచ్చేందుకు, భూమి సారవంతంగా ఉండేందుకు ఉపయోగిస్తున్న పిల్లి పెసరు, జీలుగ, జనము విత్తనాలను తక్కువ ధరలకే సబ్సిడీ రూపంలో అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడి అనిత, నాయకులు శ్రీనివాసులు నాయుడు, రత్నయ్య, జకరయ్య, షబీర్, ఎంపీపీ సుజాతమ్మ, వైస్ ఎంపీపీ గోపాల్ రెడ్డి, ఏఓలు జ్యోతిర్మయి, కవిత, కాంచన తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-నాయుడుపేట: ప్రతి విద్యార్థి చదువుతో పాటు గురువులను గౌరవించడం నేర్చుకోవాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఎల్ఏ సాగరం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, బ్యాగు, పాఠ్యపుస్తకాలతో కూడిన కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, సుధీర్, రాజేష్, సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలే ట్రాయ్ లక్ష్యం..

ప్రజాశక్తి-రామచంద్రపురం: టెలికం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ట్రాయ్ లక్ష్యమని ట్రాయ్ కాగ్ సభ్యులు చిట్టిబాబు తెలిపారు. గురువారం మండలంలోని సి.రామాపురం కమ్యూనిటీ హాల్‌లో కాగ్ సభ్యులు ఆధ్వర్యంలో టెలికాం కంపెనీలు వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ ప్రపంచలో టెలికాం కంపెనీ అత్యధికంగా కలిగివున్న దేశల్లో, భారతదేశం రెండవ స్థానంలో ఉందని తెలిపారు. మొబైల్ వినియోగదారులు టెలికాం సంస్థల నుంచి ఉత్తమ సేవలు అందుకునేలా వినియోగదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. అవగాహన సదస్సులులో గిరిబాబు, బీఎస్ఎన్ఎల్ ఎస్‌డీఈ ప్రభాకర్, తిరుపతి జిల్లా లీగల్ సర్వీస్ మెంబర్ అమర్‌నాథ్, యువరాజులు, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ